

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని కొత్తపేటలో ధర్నా చేస్తున్న పత్తి రైతులు

# భగ్గుమన్న పత్తి రైతు

- కొనుగోళ్లు నిలిపివేయడంపై మండిపాటు
- ఆసిఫాబాద్‌లో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- కిష్టంపేట, కొత్తపేటలో రోడ్డెక్కిన రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ)/కౌటాల/వెల్గటూర్/చెన్నూర్ రూరల్: పత్తి కొనుగోళ్లు చేపట్టకపోవడంపై రైతులు భగ్గుమన్నారు. మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. నాలుగు రోజులుగా పత్తి కొనుగోలు చేయడం లేదంటూ కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట స్థానిక రైతులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు నిలిపివేయడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయని, రోజుల తరబడి ఎదురు చూడటం వల్ల వాహనాల చార్జీల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సీసీఐ స్పందించి ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పత్తిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

### కొత్తపేటలో ధర్నా..

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేటలో రాష్ట్ర రహదారిపై పత్తి రైతులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఎండపల్లి మండలం కొత్తపేటలో శాతవాహన జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో రోజుకో కారణం చెప్పి పత్తి కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. రెండ్రోజుల కిందట ఆన్‌లైన్‌లో ఆధార్‌తో రైతు సాగు చేసిన పంటల వివరాలు సరిపోవడం లేదని నిలిపివేశారని, మంగళవారం సిగ్నల్ కూడా రావడం లేదని కొనుగోలు చేయలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ధర్నాతో ఇరువైపులా కిలో మీటర్ పొడవున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి రైతులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు.

### కిష్టంపేటలో రహదారిపై ధర్నా..

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామ సమీపంలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం చెన్నూర్–మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. వీరి ఆందోళనకు బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. మూడు రోజులుగా పత్తి వాహనాలతో ఇక్కడే ఉండాల్సి వస్తున్నదని, ఆన్‌లైన్ పని చేయడం లేదంటూ సీసీఐ అధికారులు నిర్లక్ష్యపు సమాధానమిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. మాజీ ఎంపీపీ మంత్రి బాపు మాట్లాడుతూ.. దళారులు–సీసీఐ అధికారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నిత్యం రోడ్డెక్కాల్సి వస్తున్నదని, ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి రెండు గంటల పాటు ధర్నా చేయడంతో రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మార్కెట్ సెక్రటరీ రామాంజనేయులు, పట్టణ సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు, సీపీవో అక్కడికి చేరుకొని ఆన్‌లైన్ రాగానే పత్తి కొనుగోళ్లు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



కౌటాలలో రెండు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

### కౌటాలలో రెండు కిలోమీటర్ల మేర జామ్

ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని శ్రీ వైష్ణవీ మాత కాటన్ ఇండస్ట్రీస్‌లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రెండు కిలోమీటర్ల మేర పత్తి వాహనాలు నిలిచిపోయాయి. వాహనాలు, డ్రైవర్ల కిరాయి భారం పడుతుందని, వెంటనే పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. కాగా, కొందరు గత్యంతరం లేక ఎంతో కొంతకు ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని అమ్ముకొని వెనుదిరుగుతున్నారు.

# రైతుబంధుతో పెరిగిన పంటల ఉత్పత్తి

- ఇతర పథకాలేమో గానీ ఇది ఇవ్వాల్సిందే
- మదర్ డెయిరీ ఆస్తుల అమ్మకం సరికాదు
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : అవునన్నా, కాదన్నా... రైతుబంధు పథకంతోనే రాష్ట్రంలో సాగు విస్తీర్ణంతోపాటు పంటల ఉత్పత్తి బాగా పెరిగిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఇతర పథకాల సంగతి ఏమో గానీ రైతుభరోసా పథకాన్ని మాత్రం కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని అన్నారు. మంగళవారం నల్లగొండలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు రెండు ఎకరాల భూమికి రైతుభరోసా డబ్బులు జమ చేశారని, మిగిలిన రైతులకు కూడా త్వరలోనే పూర్తి చేయాలని కోరారు. నల్లగొండ–రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్యకు సంబంధించిన మదర్ డెయిరీ ఆస్తులను విక్రయించాలన్న నిర్ణయం సరైంది కాదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సంస్థకు నష్టాలు వస్తున్నాయన్న పేరుతో ఆస్తులు అమ్ముకుంటూపోతే చివరకు మదర్ డెయిరీ అమ్ముకోవాల్సి పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. ఆస్తుల అమ్మకమే పరిష్కారం కాదని, పరిమితికి మించిన ఖర్చును నియంత్రించుకోవాలని, నిజాయితీగా సంస్థ కోసం పని చేయాలని సూచించారు. నష్టాలు వస్తుంటే 250 మంది సిబ్బందిని పర్మినెంట్ చేయడం ఎందుకని ప్రశ్నిస్తూ వీటిపై ప్రభుత్వం, డెయిరీ పాలక వర్గం సరైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని, దానిపై తానేమీ స్పందించబోనని తెలిపారు. గతంలో మాదిరిగా బీపీఎల్‌తోపాటు ఏపీఎల్ రేషన్ కార్డులు ప్రవేశపెట్టాలని చెప్పారు. ఈ విషయమై తాను ఇదివరకే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసినట్టు తెలిపారు. దీని వల్ల రేషన్ కార్డులకు ఉన్న డిమాండ్ కొంత తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.

# ఇద్దరు రైతుల ఆత్మహత్య


మొదటిపేజీ తరువాయి...

అప్పులు తీర్చాడు. ఇంకా అప్పులు మిగిలి ఉండగా.. ఉన్న రెండున్నర ఎకరాల్లో పంటలు పండిస్తున్నాడు. ఈ వానకాలంలోనూ పత్తి పంట సాగు చేశాడు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. చేసేది లేక మరో అర ఎకరాను రూ.3.50 లక్షలకు కుదువ పెట్టాడు. భూ బదలాయింపు జరిగి ఫిబ్రవరితో 11 నెలలు కాగా.. మరో నెల గడువు మాత్రమే ఉండటంతో బ్రోకర్ వచ్చి రైతు చిన్నయ్యను సంప్రదించాడు. నెల రోజుల గడువు మాత్రమే ఉన్నదని సోమవారం మరోసారి రైతు వద్దకు వెళ్లి హెచ్చరించాడు. తాడూరుకు చెందిన గ్రామపెద్ద ఇంకా సమయం ఉన్నది.. అప్పటి వరకు డబ్బులు చెల్లిస్తాడు అని బ్రోకర్‌ను సర్దిచెప్పి పంపించాడు. కాగా రైతు భరోసా సాయం అందకపోవడం.. పంటలు సాగు చేస్తే పెట్టుబడులు మీదపడటం.. దిగుబడి రాక.. రూ.15 లక్షల అప్పు తీర్చే మార్గం కానరాక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

### చండూరులో రైతు రమేశ్..

మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన రైతు బుడ్డనొల్ల రమేశ్ (38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సాగు కలిసిరాలేదు. కుటుంబ అవసరాలతోపాటు వ్యవసాయానికి సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈ నెల 10న మధ్యాహ్నం మంజీరానదిలో దూకి చనిపోతున్నట్టు భార్యకు ఫోన్‌చేసి చెప్పి నీటిలో దూకాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చి మంజీరానది వద్దకు చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో వెతకగా రమేశ్ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై మిస్బావొద్దీన్ తెలిపారు.

## లోకం పోకడ



## హోంగార్డుల వేతనాలు భరోసాకు మళ్లింపు?

మొదటిపేజీ తరువాయి...

హోంగార్డులకు నాలుగు నెలలకు ఒకసారి వేతన నిధులను ఆర్థికశాఖ విడుదల చేస్తుంది. ఇప్పటికే విడుదలైన నిధుల్లో ఫిబ్రవరికి అందాల్సిన సుమారు రూ.47 కోట్లను అత్యవసరంగా రైతు భరోసాకు మళ్లించిన నేపథ్యంలో వేతనాలు మరింత ఆలస్యమవుతాయని తెలుస్తున్నది. రెండు నెలలకు ఒకసారి వేతనం వస్తుండటంతో హోంగార్డులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే 11వ తేదీ నాటికీ వేతనం పడకపోవడంతో.. 10వ తేదీకి పెట్టుకున్న ఈఎంఐలను చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నెలవారీ ఫీజుల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదని, కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సుమారు 16 వేల మంది హోంగార్డుల వేతనాలను రైతు భరోసాకు ప్రభుత్వం మళ్లించిందని తెలిసి మరింత ఆవేదనకు లోనవుతున్నారు.

## సిరిసిల్లలో మరో నేత కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11: సిరిసిల్లలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన వేముల సతీశ్‌కుమార్ (65)కు భార్య, ఇద్దరు కొడుకులు. 20 ఏండ్ల క్రితం ఉపాధి కోసం తంగళ్లపల్లికి వచ్చాడు. అద్దె భవనాల్లో ఉంటూ మరమగ్గాలు నడుపుతూ జీవనం సాగించాడు. భార్య చనిపోగా, కొడుకులు ఇద్దరు మహారాష్ట్రలోని భీవండిలో ఉంటున్నారు. కేసీఆర్ పాలనలో చేతినిండా పనితో సంతోషంగా బతికాడు. తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడం, వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడంతో పనుల్లేక ఇబ్బంది పడ్డాడు. ఉపాధి కరువై తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం రాత్రి తాను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

## లక్షల ఎకరాలు బ్లాక్

మొదటిపేజీ తరువాయి...

సదరు రైతులకు రైతుభరోసా బంద్ అయింది. ఇప్పటివరకు ప్రభుత్వం రెండెకరాల వరకు జమ చేయగా, ఈ జాబితాలో ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. తోటి రైతులకు రైతుభరోసా అందగా, తమకు ఎందుకు రాలేదో తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే నెలకొన్నది.

### సర్వే నంబర్లు బ్లాక్.. భూమి గల్లంతు

వరంగల్ జిల్లాలో ఒక రైతుకు రెండెకరాల భూమి ఉన్నది. ఆ రైతుకు రైతు భరోసా జమ కాలేదు. దీంతో ఎందుకు రాలేదో తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాడు. సదరు అధికారి రైతు వివరాలను వెబ్‌సైట్‌లో పరిశీలించగా, ఆ రైతుకు అసలు భూమే లేనట్టుగా చూపించింది. దీంతో ఇద్దరూ అవాక్కయ్యారు.

సిద్దిపేట జిల్లాలో మరో రైతుకు ఆరు ఎకరాల భూమి ఉన్నది. వెబ్‌సైట్‌లో మాత్రం సదరు రైతుకు నాలుగు ఎకరాలు మాత్రమే ఉన్నట్టుగా చూపిస్తున్నది. వెంటనే సదరు అధికారి క్రాప్‌బుకింగ్ సర్వేలో పరిశీలించగా, ఆ రైతుకు ఆరు ఎకరాలు ఉన్నట్టు చూపిందని సమాచారం. దీంతోపాటు ఇటీవల నిర్వహించిన నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ సర్వేలోనూ పరిశీలించగా ఆ రైతు భూమి ఆ జాబితాలో లేనట్టు తెలిసింది. ఇవన్నీ బాగానే ఉన్నప్పటికీ, రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన జాబితాలో పలు సర్వే నంబర్లను బ్లాక్ చేయడమే ఇందుకు కారణమని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. దీనిపై వ్యవసాయ అధికారులు రెవెన్యూ శాఖ అధికారులను సంప్రదించగా.. కొన్ని భూములకు సంబంధించి సర్వే చేశామని, వాటిపై అనుమానంతో బ్లాక్‌లో పెట్టినట్టు చెప్పారని తెలిసింది. దీంతోపాటు నిజాం కాలంనాటి భూముల విషయంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని చెప్పినట్టు సమాచారం.

### రైతుల్లో ఆందోళన.. సమాధానం చెప్పేవారు కరువు

వెబ్‌సైట్‌లో భూముల వివరాలు తప్పుగా చూపించడంతో తమ భూములు ఏమయ్యాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటిని సరి చేసుకునేందుకు అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఎలాంటి సమస్యలేని భూములు ఇప్పుడు హఠాత్తుగా కనిపించకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు. రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఒక ఏఈవో ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు బాగానే ఉన్నారని, కానీ పైన జరిగే తప్పులకు తాము శిక్ష అనుభవిస్తున్నామని వాపోయారు.

### పాత వాళ్లకు సగమే.. కొత్తవాళ్లకు మొత్తమే లేదు

ఇప్పటివరకు రెండెకరాల రైతులకు రైతుభరోసా జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, క్షేత్రస్థాయిలో చాలామంది రైతులు తమకు రైతుభరోసా ఎందుకు రాలేదంటూ ఏఈవోలను సంప్రదిస్తున్నారు. రెండెకరాల వరకు సుమారు 40 లక్షల మంది రైతులు ఉండగా, ప్రభుత్వం 30.26 లక్షల మందికి మాత్రమే రైతుభరోసా జమ చేసింది. ఈ యాసంగిలో కొత్త రైతులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. వారికి జమ కాలేదని తెలిసింది. మరోవైపు రెండెకరాల వరకే మూడు విడతల్లో వేసిన ప్రభుత్వం.. మొత్తం రైతులకు ఇచ్చేందుకు ఎన్ని విడతలు తీసుకుంటుందో అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పెన్‌పహాడ్ మండలం చిన్న గారకుంటతండాలో ఎండిన పొలాల్లో నిలబడి నిరసన తెలుపుతున్న రైతులు

# నీళ్లియ్యకపోతే గాంధీభవన్ ముట్టడి

**సర్కార్‌కు రైతుల మూడ్రోజుల గడువు.. ఎండిపోతున్న పొలాల్లో రైతుల ఆందోళన**

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 11 : మూడ్రోజుల్లో సాగునీళ్లు విడుదల చేయకపోతే 3వేల మంది రైతులతో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌ను ముట్టడిస్తామని ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం చెట్ల ముకుందాపురం, చిన్నగారకుంటతండా, పెద్ద గారకుంటతండా, జల్మలకుంటతండా, చిన్న సీతారాంతండాలో ఆయకట్టు కింద ఎండిపోతున్న పొలాల్లో నిలబడి మంగళవారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సాగునీటి కోసం జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వేల ఎకరాల్లో పొలాలు ఎండితున్నా ప్రజాప్రతినిధులకు చీమ కుట్టినట్టు అనిపించడం ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ చావులకు జిల్లా మంత్రే బాధ్యత వహించాలని హెచ్చరించారు. విడుతల వారీగా కాకుండా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరారు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్కరోజు కూడా పొలాలు ఎండిపోలేదని తెలిపారు. నిరసన తెలిపిన వారిలో ఓయూ జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్, రైతులు ధరావత్ నగేశ్, ధరావత్ నాగు, ధరావత్ కిషన్, ధరావత్ దాసు, ధరావత్ శ్రీను, పవన్ ఉన్నారు.

# పోలీసు పహారా మధ్య కొడంగల్ సర్వే

- ఊట్కూర్ మండలం బాపురం శివారులో కొనసాగిన సర్వే
- భూములుపోతే బతికేదెట్లా? అని రైతుల ఆందోళన



నారాయణపేట జిల్లా బాపురం శివారులో పోలీసు పహారా మధ్య భూసర్వే చేపట్టిన అధికారులు

ఊట్కూర్, ఫిబ్రవరి 11 : నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల సర్వేను రైతులు అడుగడుగునా అడ్డుకుంటున్న నేపథ్యంలో అధికారులు పోలీసులను భారీగా మోహరించి భూసేకరణ సర్వే చేపడుతున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కాన్‌కుర్తి వరకు మూడు చోట్ల నీటిని లిఫ్ట్ చేసేందుకు ప్రభుత్వం మొదటి దశ పనులను ప్రారంభించింది. రెండు దశల్లో పనులు చేపట్టేందుకు సర్కారు నిర్ణయించి టెండర్‌ను మేఘా ఇంజినీరింగ్ కంపెనీకి అప్పగించగా.. మూడు పంప్‌హౌస్‌లు, ఓపెన్ కెనాల్, పైపులైన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టింది. వారం రోజులుగా రైతుల నుంచి వ్యతిరేకత మొదలైంది. పొలాల్లో సర్వే చేపట్టేందుకు వస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను అడ్డుకొని తిప్పి పంపుతున్నారు. వారి ఆందోళనను లెక్క చేయకుండా ప్రభుత్వం మంగళవారం ఊట్కూర్ మండలం ఓబ్లాపూర్ శివారులో పోలీసులను భారీగా మోహరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నారాయణపేట డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలతోపాటు 30 మందికిపైగా కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్ల మధ్య రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే పూర్తి చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోగా ఊట్కూర్ మండలం బాపురం శివారులోని సర్వే నంబర్ 30లో ఉన్న 70 ఎకరాల ప్రభుత్వ భూమికి తహసీల్దార్ చింత రవి దగ్గరుండి కొలతలు చేయించారు. సర్వే జరుగుతున్నంత సేపు తిప్రాస్‌పల్లి, బాపురం గ్రామాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. అధికారులకు తమ సమస్యలను చెప్పుకునేందుకు వస్తున్న బాపురం రైతులను పోలీసులు శివారులోనే అడ్డుకున్నారు. భూములు తీసుకుంటే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తంచేశారు. పరిహారం ఎంతిస్తారు? ఏం న్యాయం చేస్తారో చెప్పకుండా పోలీసు బలగాలతో భయభ్రాంతులకు గురిచేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని తహసీల్దార్ చింత రవి తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో చీర్స్

**ఇద్దరు ముఖ్యనేతల కనుసన్నల్లో బీరు ధరల సవరణ**

- ఒకే రోజు 2 రాష్ట్రాల్లో బీర్ల ధరల పెంపు
- స్ట్రాంగ్‌పై 30.. అల్ట్రా బీరుపై 40 పెంపు
- మూడు క్యాటగిరీల్లో 15 శాతం వడ్డన
- ఇష్టం లేకున్నా పెంచుతున్నట్టు కలరింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : మద్యం ధరల పెంపు ఇష్టం లేనేలేదనుకుంటూనే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క బీరుపై గరిష్ఠంగా రూ.40 పెంచింది. మద్యం ప్రియులు ఎక్కువగా తాగే ఓ బ్రాండ్ బీరు ధర గరిష్ఠంగా రూ.260కి చేరింది. బీరు సప్లయ్ కంపెనీల మార్జిన్ కోసం అంటూ తెలంగాణ ప్రభుత్వం, రిటెయిలర్ మార్జిన్ కోసం అంటూ ఏపీ ప్రభుత్వం ఒకే రోజు మద్యం ధరలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. రెండు రాష్ట్రాల్లో ఒకేరోజు మద్యం ధరలు పెరుగుతూ ఉత్తర్వులు రావటం యాదృచ్ఛికం కాదని, ఇరు రాష్ట్రాల ముఖ్యనేతలు పక్కాగా కూడబలుక్కొనే మద్యం ధరలు పెంచారనే చర్చలు మద్యం మార్కెట్ వర్గాల్లో జోరుగా నడుస్తున్నాయి. మొత్తంలో ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ ఇతర పన్నులు పోను మిగిలిన సొమ్మంతా బ్రూవరీల జేబుల్లోకే పోనుంది.

### పెంపుపై ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

డిస్టిలరీలు, బ్రూవరీలు, సప్లయ్ కంపెనీలు కోరిన బేసిక్ ధరలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏనాడో సిద్ధమైందని, నేడో రేపో ధరల పెంపు ఖాయమని, ప్రజా వ్యతిరేకతను తప్పించుకునేందుకు, మద్యం ప్రియులను ఏమార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం, బ్రూవరీలు కలిసి బీర్ల బందు నాటకాన్ని రక్తి కట్టించిన విషయాన్ని బట్టబయలు చేస్తూ 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురించింది. వాస్తవానికి సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన ముగించుకొని వచ్చిన మరుసటి రోజే బీర్ల ధరలు పెంచుతూ ఉత్తర్వులు రావాల్సి ఉన్నదని, కానీ 'నమస్తే తెలంగాణ' కథనాల నేపథ్యంలో కొంత కాలం వాయిదా వేసినట్టు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. రేవంత్‌రెడ్డి సీఎం కాగానే మద్యం కంపెనీల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి బేసిక్ ధర పెంచాలని వినతి పత్రాలు ఇచ్చారు. 2019 నుంచి కేసీఆర్ ప్రభుత్వం బీర్ల ధరలు పెంచలేదని ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొలి ఫేవర్ కింద సోం డిస్టిలరీకి చెందిన బ్లాక్‌ఫోర్డ్, హంటర్, వుడ్‌పీకర్ బీర్లను రాష్ట్రంలోకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్య తిరేకించడంతో వెనక్కి తగ్గింది. ఎక్సైజ్ మంత్రి జూపల్లి మీడియా ముందుకు వచ్చి సోం డిస్టిలరీ ఉత్పత్తులకు అనుమతి ఇవ్వలేదని ప్రకటించారు. మరుసటి రోజే నాలుక కరుచుకొని సోం బీర్లకు టీఎస్‌బీసీఎల్ అనుమతించిందని చెప్పారు.

### పక్క రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే..

పక్క రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే మద్యం వ్యాపారులు అటునుంచి నరుక్కురావటం మొదలు పెట్టారని, అక్కడి ముఖ్యనేత కనుసన్నల్లో టీఎస్‌బీసీఎల్ కార్యకలాపాలు కొనసాగుతూ వస్తున్నాయని మద్యం మార్కెట్‌లో చర్చ జరిగింది. పక్క రాష్ట్రంలో మద్యం పాలసీ అమల్లోకి వచ్చి, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం దుకాణాలు ప్రైవేట్ పరం చేసిన సమయంలో అక్కడ ధరల నిర్ణయ కమిటీ రూపుదిద్దుకున్నది. కమిటీలోకి పొరుగు రాష్ట్రం ముఖ్యనేత తనకు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్న సీనియర్ ఐఏఎస్‌ను చొప్పించినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. అన్నట్టుగానే ఏపీ క్యాడర్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కమిటీలోకి వచ్చారు. అట్లాగే తెలంగాణలో మద్యం వ్యాపారంలో బాగా ఆరితేరిన ఎమ్మెల్యే స్థాయి ప్రతినిధిని కమిటీలో సభ్యుడిగా చేర్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. కానీ నిబంధనలు అంగీకరించకపోవటంతో ఆయనకు అనధికారిక బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం.ఈ ఇద్దరి కనుసన్నల్లోనే ధరల నిర్ణయం జరిగినట్టు వ్యాపార వార్గలు చెప్తున్నాయి. తాము తయారు చేసే బీర్లను తెలంగాణలో ఇక మీదట విక్రయించబోమని ఓ కంపెనీ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం ఇచ్చింది. ప్రభుత్వ పెద్దలు కొందరు మీడియా ముందుకు వచ్చి రాష్ట్రంలో పెద్ద మార్కెట్ ఉన్న బీర్లు బందైపోయాయని, జరగరాని ఉపద్రవం ఏదో జరిగిపోయినట్టుగా బిల్డప్ ఇచ్చారు. ఎక్సైజ్ మంత్రి బీర్ల కంపెనీలు 33 శాతం పెంచాలని అడుగుతున్నాయని, ఇలా పెంచితే ప్రభుత్వం మీద భారం పడుతుందని చెప్పారు. తెలంగాణలో రేట్లు తక్కువే ఉన్నాయని చెప్పారు. తర్వాత సీఎం అత్యవసర సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. తర్వాత బీర్ల సరఫరాను కంపెనీ పునరుద్ధరించింది. పాలకులు, సప్లయ్ కంపెనీ లోగుట్టును పసిగట్టిన 'నమస్తే తెలంగాణ' 'క్లైమాక్స్‌కు లిక్కర్ రేట్లు' శీర్షికతో బీర్ల రేట్ల పెంపును బట్టబయలు చేసింది. ధరల నిర్ణయ కమిటీ నివేదిక మేరకు తాజాగా 3 రకాల బీరు క్యాటగిరీలతో బేసిక్ ధరను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే రోజున పొరుగు రాష్ట్రంలోనూ 14 శాతం మార్జిన్ పెంచుతున్నట్టు అక్కడి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


నమస్తే తెలంగాణ

క్లైమాక్స్‌కు లిక్కర్‌రేట్లు!

మద్యం ధరల పెంపుపై దొంగాట!

### కొన్ని బ్రాండ్ల బీరు ధరలు..

| బ్రాండ్ | కొత్త ధర | పాత ధర | పెరిగింది |
|---|---|---|---|
| బడ్వైజర్ | 250 | 210 | 40 |
| కార్ల్స్‌బెర్గ్ | 230 | 190 | 40 |
| కింగ్ ఫిషర్ అల్ట్రా | 250 | 210 | 40 |
| కింగ్‌ఫిషర్ అల్ట్రా విట్ | 370 | 320 | 50 |
| కింగ్ ఫిషర్ స్ట్రాంగ్ | 190 | 160 | 30 |
| నాకౌట్ | 190 | 160 | 30 |
| రాయల్ చాలెంజ్ | 180 | 150 | 30 |
| హేవార్డ్స్5000 | 190 | 160 | 30 |

### ప్రతిదీ పక్కాగా

మద్యం ధరలు పెంచే మొత్తం ఎపిసోడ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిదీ పక్కా ప్రణాళికతోనే చేసినట్టు స్పష్టమవుతున్నది. ధరల నిర్ణయ కమిటీ వేసే దగ్గర నుంచి మొదలు పెట్టి ధరలు పెంచే వరకు అన్నీ రెండు రాష్ట్రాల ముఖ్యనేతల కనుసన్నల్లోనే జరిగినట్టు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. రెండు రాష్ట్రాల మద్యం ధరలు, డిస్టిలరీలకు చెల్లింపులు, సుంకాలు ఒకే తరహాలో ఉంటే న్యాయపరమైన ఇబ్బందులు ఉండవు. కాగ్ కూడా పొరుగు రాష్ట్రాల ఎమ్మార్పీ, బేసిక్ ధరలను సరిపోల్చి నివేదికలు రూపొందిస్తుంది. ఈ నేపథ్యంలో కాగ్ లాంటి కేంద్ర ఆడిట్ సంస్థలకు దొరక్కుండా ఉండేందుకు, ప్రజలను ఏమార్చేందుకే ఇంత పెద్ద నాటకమాడినట్టు చర్చ నడుస్తున్నది.